క్లుప్తంగా

రహదారిపై పార్కింగ్‌కు అడ్డుకట్ట



రాక్‌మెన్ కంపెనీ ముందు వాహనాలను ఖాళీ చేయించిన తర్వాత రహదారి ఇలా..

సాక్షి ఎఫెక్ట్..

రేణిగుంట(ఏర్పేడు) : ఏర్పేడు మండలం పాగాలి సమీపంలోని రాక్‌మెన్ కర్మాగారం ఎదుట నిత్యం అధిక సంఖ్యలో లారీలను పార్కింగ్ చేసి రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్న నేపథ్యంలో 'ప్రమాదకరం' శీర్షికన గురువారం సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీనికి అధికారులు స్పందించారు. ఏర్పేడు సీఐ జయచంద్ర కర్మాగారం వద్దకు చేరుకుని రోడ్డుపైన పార్కింగ్ చేసి ఉన్న వాహనాలను అక్కడ నుంచి ఖాళీ చేయించారు. ఇకపై రోడ్డు మీద పార్కింగ్ చేయించకుండా చర్యలు చేపట్టాలని కర్మాగారం యాజమాన్యానికి సూచించారు.

ఆగమోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురుదక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గు రుదక్షిణామూర్తికి పలురకాల అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ఘర్షణలో ఇద్దరికి గాయాలు

నారాయణవనం : ఇరు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో కీళగరం బీసీ కాలనీకి చెందిన తండ్రి, కొడుకులు గాయపడ్డారు. ఎస్ఐ రాజశేఖర్ కథనం మేరకు.. కీలగరం బీసీ కాలనీలో నివాసం ఉంటున్న ధర్మలింగం ఇంటి వెనుక అదే గ్రామానికి చెందిన మణికంఠన్ తన స్థలంలో పశువుల కొట్టం నిర్మించుకున్నాడన్నారు. దుర్వాసన కారణంతో పేడదిబ్బ విషయంపై తరచూ వారి మధ్య గొడవలు జరిగేవన్నారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం మణికంఠన్ తల్లి సుమతిని పేడ దిబ్బలు తీసేయాలని వాగ్వాదానికి దిగారన్నారు. స్థానికులు జోక్యం చేసుకొని సర్ది చెప్పి పంపించినట్లు తెలిపారు. రాత్రి ధర్మలింగం ఇంట్లో కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేస్తుండగా మణికంఠన్ తన అనుచరులతో వచ్చి దాడి చేశాడని తెలిపారు. ఈ దాడిలో ధర్మలింగం, అతని పెద్ద కుమారుడు లోకేష్‌కు గాయాలయ్యాయని చెప్పారు. ధర్మలింగం చిన్న కుమారుడు సోమనాథం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పాఠశాలలకు చేయూత



సమావేశమైన సంస్థ ప్రతినిధులు

శ్రీకాళహస్తి : మండలంలోని పెద్దకన్నలి జడ్పీ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, ఎస్టీ కాలనీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సౌకర్యార్థం శ్రీకాళహస్తి పట్టణంలోని ఇన్ఫినిటీ ఫిన్‌కార్ప్ సొల్యూషన్ ప్రైవేటు లిమిటెడ్, ముంబై సీఎస్ఆర్ ప్రోగ్రాం ద్వారా పాఠశాలకు అవసరమైన సుమారు రూ.1.50 లక్షలు విలువ చేసే కుర్చీలు, టేబుల్స్, బీరువాల, ఆర్వో సిస్టమ్, విద్యార్థులకు అవసరమైన జామెట్రీ, అట్టలు, తదితర విద్యా సామగ్రిని ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ సీఈఓ, ఎండీ శ్రీకాంత్, రవల్కర్, రీజనల్ సేల్స్ మేనేజరు మోహన్, మురళి, శివ, ఎంపీడీఓ సురేంద్రనాథ్, ప్రధానోపాధ్యాయుడు మాధవయ్య, స్రవంతి, గీత పాల్గొన్నారు.

మామిడికి మంచు దెబ్బ

బుచ్చినాయుడుకండ్రిగ : కొద్ది రోజులుగా కురుస్తున్న మంచు ప్రభావంతో మండలంలో మామిడిలో పూత రావడం లేదని మండల ఉద్యానవనశాఖాధికారిణి యామిని పేర్కొన్నారు. గురువారం కనమనంబేడు, నీర్పాకోట, గాజులపెళ్లూరు, బుచ్చినాయుడుకండ్రిగ గ్రామాల్లోని మామిడి తోటలను పరిశీలించి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. పూత రావటం కోసం ఒక లీటర్ నీటిలో మల్లీకే మందును కలిపి పిచికారీ చేస్తే పూత వస్తుందన్నారు. మంచు నివారణకు బుప్రోఫెజిన్‌ను నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. మామిడి, మిరప పంటల సాగులో సలహాలు, సూచనల కోసం 79950 86941 నంబరుకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని ఉద్యానశాఖ అధికారిణి యామిని తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

రేణిగుంట(ఏర్పేడు): ఏర్పేడు మండలం, మన్నసముద్రం కొండరాయుడు చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం గురువారం లభ్యమైనట్లు సీఐ జయచంద్ర తెలిపారు. సుమారు 40–45 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి 20 రోజుల కిందట చెరువులో పడి మృతి చెంది ఉండొచ్చని, మృతదేహం కుళ్లిపోయి ఉందన్నారు. మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు.

ఆధార్ ఉన్నా.. సేవలు సున్నా !



మండలంలోని గాజులపెళ్లూరు గిరిజన కాలనీకి చెందిన సుబ్బలక్ష్మి, కృష్ణవేణి ఆధార్ కార్డులోని తప్పులను సవరించుకునేందుకు బుచ్చినాయుడుకండ్రిగలోని సచివాలయం వద్ద పడిగాపులు పడుతున్నారు. ఇక్కడ ఆధార్ కేంద్రం ఉన్నా డిజిటల్ అసిస్టెంట్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఆధార్ కేంద్రానికి పలుమార్లు వచ్చినా పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రెండు వారాలుగా కూలీ పనులకు వెళ్లకుండా వచ్చినా ఫలితం లేకుండా పోయిందని వాపోతున్నారు. అధికారులు స్పందించి ఆధార్‌లోని తప్పులను సవరించేందుకు సిబ్బందిని నియమించాలని కోరుతున్నారు. – బుచ్చినాయుడుకండ్రిగ

లీకేజీలతో అగచాట్లు



నాగలాపురం ఎర్ర చెరువుకు సమీపంలో ఆలయానికి ఎదురుగా పల్లాపు తూములో గేట్లు మరమ్మతులకు గురి కావడంతో నీరు భారీగా లీకేజీ అవుతూ బీసీ కాలనీ మీదుగా ప్రవహిస్తోందని కాలనీ వాసులు వాపోతున్నారు. వీధుల మీదుగా నీరు ప్రవహించడంతో చెత్త పేరుకుపోయి దోమలకు ఆవాసంగా మారింది. తద్వారా కాలనీలో ప్రజలు వ్యాధుల బారీన పడుతున్నారు. తూము గేటు మరమ్మతులు చేయించి చెరువు నీటి లీకేజీలు అరికట్టాలని బీసీ కాలనీ వాసులు కోరుతున్నారు. – నాగలాపురం

పొంచి ఉన్న ప్రమాదం



ట్రాన్స్‌ఫార్మర్‌కు చుట్టూ రక్షణ కంచె లేకపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. మండల కేంద్రమైన నారాయణవనంలో దాదాపు అన్ని ట్రాన్స్‌ఫార్మర్లు రద్దీగా ఉండే వీధులు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలకు సమీపంలోనే ఉన్నాయి. బాలుర ఉన్నత పాఠశాల, తహసీల్దార్ కార్యాలయం, వేంకటేశ్వరస్వామి ఆలయం, కీళగరం నుంచి సముదాయం క్రాస్ రోడ్డు వరకు అడ్డదారిలో మూడు ట్రాన్స్‌ఫార్మలకు కంచెను ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని స్థానికులు కోరుతున్నారు. – నారాయణవనం

కల్యాణ భాగ్యం కలేనా!

సత్యవేడులో టీటీడీ కల్యాణ మండప నిర్మాణానికి 2024 ఆగస్టు 28న ఎమ్మెల్యే ఆదిమూలం అట్టహాసంగా భూమిపూజ చేశారు. తరువాత గుంతలు తీసి వదిలేశారు. ఫలితంగా పనులు అటకెక్కాయి. రూ.2 కోట్ల టీటీడీ నిధులున్నా.. నిర్మాణ పనుల్లో జాప్యం నెలకొంది. దీంతో ప్రైవేటు కల్యాణ మండపాల్లో అధిక డబ్బులు వెచ్చించలేక దూరభారం పోలేక స్థానిక మధ్య తరగతి ప్రజలు అవస్థలు పడుతున్నారు. టీటీడీ కల్యాణ మండపంలో ఎన్నటికి పెళ్లిళ్లు చేసుకొనే భాగ్యం కలిగేనో అని స్థానికులు ఎదురు చూస్తున్నారు.

- నత్తనడకన కల్యాణ మండప నిర్మాణం
- ఇబ్బందులు పడుతున్న జనం
- స్థానికుల ఎదురుచూపు



కల్యాణ మండపం ఏర్పాటుకు పునాదులు కోసం తీసిన గుంతలు



కల్యాణ మండపం భూమి పూజలో ఎమ్మెల్యే ఆదిమూలం (ఫైల్)

సత్యవేడు : నియోజకవర్గ కేంద్రంలో టీటీడీ కల్యాణ మండపం ఏర్పాటుకు తెలుగు గంగ కాలువ సమీపంలో 352 సర్వే నంబరులో సుమారు 92 సెంట్ల స్థలం కేటాయించారు. సుమారు రూ.2 కోట్ల టీటీడీ నిధులు కేటాయించారు. కల్యాణ మండపం ఏర్పాటు ఎమ్మెల్యే అట్టహాసంగా భూమిపూజ చేశారు. గుత్తేదారు ఆరునెలల అనంతరం పునాదుల నిర్మాణానికి పెద్ద గుంతలు తవ్వి వదిలేశారు. నిర్మాణ సామగ్రి ఇంకా నిర్మాణ స్థలానికి చేర్చలేదు. ఫలితంగా పనుల్లో కదలిక మందగించింది.

అద్దెలు కట్టలేక..

కల్యాణ మండప భవన నిర్మాణం పూర్తి కాకపోవడంతో కల్యాణాలకు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రవేటు కల్యాణ మండపాల అద్దెలు భరించలేక పోతున్నామని స్థానికులు వాపోతున్నారు. సత్యవేడులో రెండు కల్యాణ మండపాలు ఉన్నాయి. ప్రస్తుతం వివాహాలు ఎక్కువ జరుగుతుండడంతో మండపాలకు డిమాండ్ పెరిగింది. స్థానికులు సత్యవేడులో కల్యాణ మండపాలు వివాహ తేదీలకు అనుగుణంగా దొరక్కపోవడంతో దూర ప్రాంతాల్లోని కల్యాణ మండపాలకు వెళ్లాల్సి వస్తోంది. దీంతో ఖర్చుల భారం మోపెడవుతోంది. టీటీడీ కల్యాణ మండపం పూర్తి అయితే తమ పిల్లలకు పెళ్లిళ్లు చేయాలని తల్లిదండ్రులు ఎదురు చూస్తున్నారు.

పేదలకు వర ప్రదాయిని



టీటీడీ కల్యాణ మండపం సత్యవేడులో నిర్మాణం తలపెట్టడడం శ్రీ వేంకటేశ్వర స్వామి వరంగా భావిస్తున్నాం. తక్కువ అద్దెతో పెళ్లి ఖర్చు తక్కువతో పేదలు వివాహాలు చేసుకొనే అవకాశం ఉంది. టీటీడీ అధికారులు, గుత్తేదారు పనులు త్వరితగతిన పూర్తి చేసి సత్యవేడు ప్రజలకు దేవుడి కల్యాణ మండపం సిద్ధం చేయాలి.
– గుణశేఖర్, కేఎస్‌పేట, సత్యవేడు మండలం

భారం తగ్గుతుంది



టీటీడీ కల్యాణ మండపంలో అద్దె తక్కువగా ఉండడంతో పెళ్లి నిర్వాహకులకు అద్దె భారం తగ్గుతుంది. పేదలు ఎక్కువ అప్పులు చేయాల్సిన అవసరం ఉండదు. దేవుని కల్యాణ మండపంలో పెళ్లి చేయడం చాలా సంతృప్తిగా ఉంటుంది. కల్యాణ మండపం త్వరితగతిన పూర్తి చేసేలా ఎమ్మెల్యే చొరవ చూపాలి.
– శ్రీరాములురెడ్డి, కొత్తమారి కుప్పం, సత్యవేడు మండలం

తొట్టంబేడులో విద్యుత్ సరఫరాకు అంతరాయం

శ్రీకాళహస్తి : తొట్టంబేడు మండలంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు శుక్రవారం కూడా అంతరాయం కలగనున్నట్లు ఈఈ చిన్నరెడ్డెప్ప తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 132 కేవీ శ్రీకాళహస్తి విద్యుత్ సబ్ స్టేషన్‌లో గ్రీన్ ప్యానెల్ మరమ్మతులకు గురైందన్నారు. దానిని మార్చే క్రమంలో తహసీల్దారు, ఎంపీడీఓ కార్యాలయాలు, సాయి బాబా ఆలయం, ఎల్ఐసీ కాలనీ, ఈదుల గుంట, రామచంద్రాపురం, శాంతిపురం, చిట్టత్తూరు, శివనాథపురంలో గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. ఇందుకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

పార్టీ వ్యతిరేక విధానాలకు పాల్పడితే చర్యలు

బుచ్చినాయుడుకండ్రిగ : వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బుచ్చినాయుడుకండ్రిగ మండల కన్వీనరు అరణి విద్యానాథరెడ్డిని వైఎస్సార్ సీపీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు గురువారం జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ వ్యతిరేక విధానాలకు పాల్పడితే ఊరుకోమనే ఆయన హెచ్చరించారు.

దాడుల సంస్కృతి హేయం



మాజీ సర్పంచ్ వెంకటయ్య దంపతులను పరామర్శిస్తున్న నూకతోటి రాజేష్

వరదయ్యపాళెం : కూటమి ప్రభుత్వంలో దాడుల సంస్కృతి హేయమైన చర్య అని సత్యవేడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవీబీపురం మండలం మఠం గ్రామంలో వైఎస్సార్‌సీపీకి చెందిన దళిత మాజీ సర్పంచ్ వెంకటయ్య, అతని భార్యపై అదే గ్రామానికి చెందిన టీడీపీ నేత గల్లా సుదర్శన్ దంపతులు దాడి చేసి రెండు రోజుల కిందట గాయపరిచారన్నారు. శ్రీకాళహస్తి ప్రభుత్వ ఆస్పత్రిలో వారు చికిత్స పొందుతుండగా సమాచారం అందుకున్న రాజేష్ గురువారం సాయంత్రం వెంకటయ్య దంపతులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక పాత్రికేయులతో మాట్లాడుతూ.. దళితులపై దాడులను తీవ్రంగా ఖండించారు. ప్రశాంతమైన సత్యవేడు నియోజకవర్గంలో దాడుల సంస్కృతికి టీడీపీ నేతలు ఒడిగట్టడం దారుణమన్నారు. ఇలాంటి చర్యలకు స్వస్తి పలికి గ్రామాల్లో శాంతియుత వాతావరణం నెలకొనేలా పోలీసులు చొరవ చూపాలన్నారు. పార్టీ మండల కన్వీనర్ కృష్ణయ్య, కేవీబీపురం నందకుమార్, తిరుపతి, చిత్తూరు జిల్లాల మహిళా అధ్యక్షురాలు బొర్రా మాధవి, మణి నాయుడు, దయాకర్ నాయుడు, కేశవులు, మణి ఉన్నారు.

దళితులకు భద్రత కరువు

- దాడులు, హత్యలతో రాజకీయాలా?
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధికారి ప్రతినిధి చిన్నా ఆగ్రహం



సమావేశంలో ప్రసంగిస్తున్న చిన్నా

వరదయ్యపాళెం : స్నేహభావంతో కులమత రాజకీయాలకు అతీతంగా అన్నదమ్ముల్లా మెలిగే సత్యవేడు నియోజకవర్గంలో దళితులపై దాడులు చేస్తూ నూతన సంప్రదాయానికి తెరతీశారని వైఎస్సార్ సీపీ తిరుపతి, చిత్తూరు జిల్లాల అధికార ప్రతినిధి కన్నలి చిన్నా (వెంకటయ్య) ఆరోపించారు. ఇలాంటి సంప్రదాయాలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం వరదయ్యపాళెంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. సత్యవేడు మండలం ఓబులరాజు కండ్రిగలో అరుంధతివాడకు చెందిన లక్ష్మయ్యను అదే గ్రామానికి చెందిన టీడీపీకి నేత భాస్కర్‌రాజు ఆయన తనయుడు చిన్నపాటి విషయానికి దారుణంగా దాడిచేసి హతమార్చడం శోచనీయమన్నారు. అలాగే కేవీబీపురం మఠం గ్రామంలో వెంకటయ్య అనే దళితుడిని అగ్రవర్ణాల వ్యక్తులు దాడులు నిర్వహించి గాయ పరిచారన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం సత్యవేడు నియోజకవర్గం బూత్ కమిటీ అధ్యక్షుడు బందిల సురేష్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో దళితులకు భద్రత కరువైందని వాపోయారు. ఎస్సీ సెల్ అధ్యక్షుడు దుడ్డు వేణు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో దాడుల సంస్కృతి సరికాదని, ఇలాంటి చర్యలు హేయమన్నారు.

వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుల నియామకం

వరదయ్యపాళెం : సత్యవేడు నియోజకవర్గంలోని ఏడు మండలాలకు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆ మేరకు వరదయ్యపాళెం మండలానికి నాయుడు దయాకర్‌రెడ్డి, నారాయణవనం మండలానికి ఈ.సారకాయలు, కేవీబీ పురం మండలానికి గవర్ల క్రిష్ణయ్య, నాగలాపురానికి ఎస్.అపరంజిరాజు, సత్యవేడుకు కె.సుశీల్‌కుమార్‌రెడ్డి, పిచ్చాటూరుకు డి.చలపతిరాజు, బుచ్చినాయుడు కండ్రిగకు కె.మణినాయుడు నియమితులయ్యారు. అయితే బుచ్చినాయుడు కండ్రిగ మండలం మినహాయిస్తే మిగిలిన ఆరు మండలాల్లో గతంలో ఉన్న వారినే యథావిధిగా కొనసాగిస్తూ నూతన నియామకాలు జరిగాయి.

వైఎస్సార్‌సీపీ నేత మృతి



సుబ్రహ్మణ్యం (ఫైల్)

నారాయణవనం : వైఎస్సార్ సీపీ నాయకుడు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సుబ్రహ్మణ్యం (52) గురువారం మధ్యాహ్నం ఆకస్మికంగా మృతి చెందాడు. మండలంలోని గోవిందప్పనాయుడు కండ్రిగ దళితవాడకు చెందిన సుబ్రహ్మణ్యం నాగలాపురం మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా పనిచేస్తూ పంచాయతీలో పార్టీ బలోపేతానికి కృషి చేశారు. ఆయన మృతికి పార్టీ మండల అధ్యక్షుడు సారకాయలు, ఎంపీపీ దివాకర్‌రెడ్డితో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు సంతాపం వ్యక్తం చేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

జాబ్‌మేళాకు స్పందన



ఎంపికైన అభ్యర్థులతో అధ్యాపకులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో గురువారం జరిగిన ఉద్యోగ మేళాకు విశేష స్పందన లభించింది. జేకేసీ ఆధ్వర్యంలో వీల్స్ ఇండియా, డైకిన్ పరిశ్రమల ప్రతినిధులు ముఖాముఖి నిర్వహించారు. ఇందులో ఎంపికైన 30 మంది అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నాగరాజునాయుడు, వైస్ ప్రిన్సిపల్ నరసింహవర్మ, జేకేసీ కోఆర్డినేటర్ గంగారామ్, ఎఫ్‌టీఎం గిరిజమ్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.

హిందీలో ప్రతిభ



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

బుచ్చినాయుడుకండ్రిగ: బుచ్చినాయుడుకండ్రిగ జెడ్పీ ఉన్నత పాఠశాలలో దశ మంచి విద్యా సేవా సదన్ గురువారం నిర్వహించిన జాతీయ హిందీ భాష పరీక్షలో ప్రథమ, ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణులైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు రమణయ్య ప్రశంసాపత్రాలు, పతకాలు అందజేసి అభినందించారు. జాతీయ భాష హిందీపై విద్యార్థులు పట్టు సాధించాలని కోరారు. అనంతరం పాఠశాలకు గుర్తుగా ప్రధానోపాధ్యాయుడు రమణయ్యకు హిందీ ఉపాధ్యాయులు జ్ఞాపికను అందజేశారు.

పంట కాలువ ఆక్రమణ



వెంచర్‌కు దారి ఏర్పాటు

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట) : రేణిగుంట మండలం జీపాళెం పంచాయతీ కృష్ణయ్య కాలువ సమీపంలోని తిరుపతి–పాపానాయుడుపేట రహదారి పక్కన ఉన్న పంట కాలువను ఆక్రమించుకొని వెంచర్ కోసం దారి వేసుకున్నారు. పంట కాలువ సగానికి గోడ కట్టి పక్కనే ఉన్న వెంచర్‌కు వెళ్లేందుకు దారి ఏర్పాటు చేసుకోవడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అదే పంథా..చీకటి దందా!

- ఇష్టారాజ్యంగా ఇసుక, మట్టి, రేషన్ బియ్యం అక్రమ రవాణా
- రెచ్చిపోతున్న కూటమి నేతలు



శ్రీకాళహస్తి రూరల్ పోలీస్‌స్టేషన్ వద్ద జేసీబీ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో చీకటి దందా పేట్రేగుతోంది. పొద్దుగూకాక కూటమి నేతలు రెచ్చిపోతున్నారు. ఇష్టారాజ్యంగా ఇసుక, మట్టి, రేషన్ బియ్యం తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రేషన్ బియ్యం కిలో రూ.12 చొప్పున కార్డుదారుల వద్ద కొనుగోలు చేసి రూ.25 లెక్కన మిల్లర్లకు విక్రయిస్తున్నారు. ఇవన్నీ రాత్రికి రాత్రే జరిగిపోతున్నాయి. ఇందులో భాగంగా గత మూడు రోజులుగా వరుసగా అక్రమ దందాకు పోలీసులు ముకుతాడు వేస్తునఅనరు. మూడు రోజుల క్రితం అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్లను తొట్టంబేడు పోలీసులు సీజ్ చేశారు. అలాగే పుల్లారెడ్డికండ్రిగలో అక్రమంగా ఇసుక తరలింపు కోసం ఉన్న జేసీబీని, ఈదులగుంట వద్ద అక్రమంగా రవాణా చేయడానికి సిద్ధంగా ఉన రేషన్ బియ్యాన్ని శ్రీకాళహస్తి పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు.



తొట్టంబేడు పోలీస్‌స్టేషన్ వద్ద లారీ

రాత్రుల్లో రెచ్చిపోతున్న ఇసుక తోడేళ్లు

ఉచిత ఇసుక పేరుతో అక్రమార్కులు రాత్రికి రాత్రే జేసీబీలు పెట్టి తవ్వేస్తున్నారు. ఇలా తవ్విన ఇసుకను ఇతర రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. బుధవారం రాత్రి శ్రీకాళహస్తి మండలం, పుల్లారెడ్డికండ్రిగ వద్ద స్వర్ణముఖి నదిలో అక్రమంగా ఇసుక తవ్వకాలు చేస్తున్న జేసీబీని అధికారులు సీజ్ చేశారు. పుల్లారెడ్డికండ్రిగ గ్రామం పక్కనే ఉన్న స్వర్ణముఖి నదిలో రాత్రి వేళలో జేసీబీతో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నట్లు స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు పుల్లారెడ్డికండ్రిగ గ్రామానికి చేరుకుని జేసీబీని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. అనంతరం రెవెన్యూ అధికారులకు అప్పగించారు. గతంలో ఆర్డీఓ భానుప్రకాష్ రెడ్డి జేసీబీలు పట్టుకుని సంబంధిత యజమానులను మందలించి విడిచిపెట్టారు. అయినా అక్రమార్కులు లెక్కచేయలేదు.

మట్టి..కొల్లగొట్టి!

తొట్టంబేడు మండలం, శివనాథపాళెం పరిసరాల్లో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నట్లు స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ ఈశ్వరయ్య సిబ్బందితో శివనాథపాళెంలో గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్లను బుధవారం రాత్రి పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. టిప్పర్ యజమాని రమేష్ అనే యువకుడిపై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేశారు. అనంతరం తహసీల్దారు మధుసూదన్‌రావుకు వాహనాన్ని అప్పగించారు.

బియ్యం బొక్కేస్తున్న కూటమి పందికొక్కులు

టూటౌన్ పరిధిలోని ఈదుగుంటలో ఆటోలో లోడ్ చేసి నెల్లూరుకు తరలించడానికి సిద్ధం చేసిన సుమారు వంద బస్తాల(7 టన్నులు) రేషన్ బియ్యాన్ని సీజ్ చేసినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. యువదీప్‌కు చెందిన గోదాముకు వెంకటగిరి లక్ష్మి అనే మహిళ రేషన్ బియ్యం ఆటోలో తరలించినట్టు సమాచారం. పోలీసులు విచారించి కేసు నమోదు చేయనున్నారు.

ఇంటి స్థలాలు ఇచ్చే వరకు పోరాటం

శ్రీకాళహస్తి : పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చే వరకు సీపీఐ పోరాటం చేస్తుందని జిల్లా కార్యదర్శి మురళి అన్నారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కాలనీలో ఇల్లు లేని పేదల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాధారణ ఎన్నికల సందర్భంగా ఎన్డీయే కూటమి ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇంటి స్థలాలు కేటాయించే వరకు పోరాటం చేస్తామన్నారు. 10వతేదీన నిరసనలు చేపడుతామన్నారు. సీపీఐ నాయకులు జనమాల గురవయ్య, గోపి, చారులత, శీను, చందు పాల్గొన్నారు.